సాక్షి
గుంటూరు

మంగళవారం । 15 । జూలై । 2025



వైభవంగా స్వామి కల్యాణం

నగరంపాలెం: గుంటూరులోని శ్రీగౌరీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శతాబ్ది మహోత్సవాలు ముగింపు సందర్భంగా సోమవారం శాంతి కల్యాణం నిర్వహించారు.



ఆలయ నిర్మాణానికి విరాళం

నరసరావుపేట: పట్టణానికి చెందిన దివ్వెల శివ శంకరరావు జ్ఞాపకార్థం కుటుంబసభ్యులు ఇస్సపాలెంలో మహంకాళి ఆలయ నిర్మాణానికి రూ.1,01,116 అందించారు.



దుర్గమ్మ సేవలో చాగంటి దంపతులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ప్రముఖ ప్రవచనకర్త, ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు దంపతులు సోమవారం ఇంద్రకీలాద్రిపై కొలువైఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

ఓడీఓపీ అవార్డు అందుకున్న కలెక్టర్ నాగలక్ష్మి



గుంటూరు వెస్ట్: ఒకే జిల్లా–ఒకే ఉత్పత్తి కింద గుంటూరు మిర్చికి జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి దక్కడం చాలా గర్వంగా ఉందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. సోమవారం ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ చేతుల మీదుగా బంగారు కేటగిరి అవార్డును కలెక్టర్ అందుకున్నారు. కలెక్టర్‌ను కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్త, కేంద్ర సహాయ వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి జిటిఎస్ ప్రసాద్, రాష్ట్ర బీసీ సంక్షేమ, ,చేనేత పరిశ్రమల శాఖ మంత్రి ఎస్.సునీతలు అభినందించారు.

రైతులకు సరిపడా ఎరువుల సరఫరాకు ప్రణాళిక

జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు

కొరిటెపాడు (గుంటూరు): పంటల సాగు విస్తీర్ణాన్ని బట్టి అన్ని రకాల ఎరువులు కావాల్సిన మేరకు అంచనా వేసి, దానికి అనుగుణంగా నెలవారీ సరఫరా ప్రణాళికను రూపొందించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో వివిధ పంటల సాగు సాధారణ విస్తీర్ణం 1,14,725 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు వరి 6,433 హెక్టార్లు, పత్తి 1,632 హెక్టార్లలో సాగైనట్లు ఆయన వెల్లడించారు. జిల్లాలో జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 166.3 సెంటీ మీటర్లకు గానూ 75.2 సెంటీ మీటర్లు నమోదైనట్లు పేర్కొన్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల పంటల సాగు విస్తీర్ణం తగ్గినట్లు పేర్కొన్నారు. జిల్లాలో టోకు వర్తకులు, రిటైల్ డీలర్ల వద్ద యూరియా 15,021 మెట్రిక్ టన్నులు, డీఏపీ 4,252, కాంప్లెక్స్ ఎరువులు 13,797, ఎంఓపీ 946 మొత్తం కలిపి 34,016 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పంటల సాగు విస్తీర్ణాన్ని బట్టి యూరియా, ఇతర ఎరువులు అందుబాటులో ఉంచడానికి తగిన చర్యలు తీసుకున్నట్లు ఆయన వివరించారు. ఎరువుల సరఫరాలో సమస్యలుంటే సంబంధిత రైతు సేవా కేంద్రం ద్వారా మండల వ్యవసాయ అధికారికి గానీ, సహాయ వ్యవసాయ సంచాలకులకు గానీ, జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ నంబరు–8074994631కు ఫోన్ చేయాలని ఆయన సూచించారు.

వినాయకునికి సంకటహర చతుర్థి పూజలు



అమరావతి: అమరావతి అమరేశ్వరాలయంలోని విఘ్నేశ్వరస్వామి ఉపాలయంలో సోమవారం సంకటహరచతుర్థి పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకస్వామి జగర్లపూడి శేషసాయిశర్మ విఘ్నేశ్వరస్వామి వారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. స్వామి వారికి వివిధ రకాల పుష్పాలతో, గరికెతో విశేషాలంకారం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి ఉండ్రాళ్లను సమర్పించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

రేపటి నుంచి శివాలయంలో పవిత్రోత్సవాలు

పెదకాకాని: శివాలయంలో బుధవారం నుంచి మూడు రోజులపాటు పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలా కుమార్ తెలిపారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మూడు రోజుల పాటు జరిగే పవిత్రోత్సవాలను పురస్కరించుకుని బుధవారం నుంచి రాహుకేతువు పూజలు, నవగ్రహపూజలు, రుద్ర, చండీ హోమాలు, అభిషేకాలు, కుంకుమార్చనలు, శాంతి కల్యాణాలతో పాటు అన్ని సేవలు నిలుపుదల చేసినట్లు తెలిపారు. 19వ తేదీ నుంచి ఆలయంలో స్వామివారికి జరిగే నిత్య కైంకర్యాలు, అన్ని ఆర్జిత సేవలు, రాహుకేతు పూజలు, యథావిధిగా జరుగుతాయన్నారు. దేవస్థానంలో వాహనపూజలు, అన్నప్రాసనలు యథావిధిగా జరుగుతాయని తెలిపారు.

మట్టి దొంగల దోపిడీ

- రాజధానిలో భారీ యంత్రాలతో మట్టి తవ్వకాలు
- 50 నుంచి 100 లారీల్లో తరలింపు
- లారీ రూ.15 వేలకు అమ్మకం
- పలు ప్రాంతాల్లో పొక్లెయిన్ల పార్కింగ్
- పట్టించుకోని సీఆర్‌డీఏ అధికారులు
- గతంలో రాజధానిలో గుంతలు పెడుతున్నారని ఆరోపించిన వారే సూత్రధారులు
- పోలీసులకు మామూళ్లు ఇస్తున్నామంటూ బహిరంగ వ్యాఖ్యలు



రాజధానిలో అమృత యూనివర్సిటీకి చెందిన పైపులైన్‌కు ఇరువైపులా మట్టి తవ్వకాలు

తాడేపల్లి రూరల్: రాజధానిలో మట్టి మాఫియా చెలరేగుతోంది. అర్ధరాత్రి దొరికిన చోటల్లా తవ్వకాలు చేస్తున్నారు. బహిరంగా మార్కెట్‌లో అమ్ముకుని జేబులు నింపుకుంటున్నారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు యర్రబాలెం, నవులూరు, కృష్ణాయపాలెం, మందడంలతో పాటు పలు ప్రాంతాల్లో మట్టి మాఫియా చెలరేగిపోయింది. ఒక్కో ప్రాంతంలో లోడింగ్ చేయడానికి రెండు నుంచి ఐదు జేసీబీలు, మట్టి తవ్వేందుకు భారీ పొక్లయిన్లు వినియోగించారు. రాత్రి 10 గంటల నుండి ఉదయం 5 గంటల వరకు యథేచ్ఛగా తవ్వకాలు చేసినట్లు స్థానికులు చెబుతున్నారు.

ప్రతి నెలా మామూళ్లు

మంత్రి అండదండలు ఉన్న మాజీ ప్రజాప్రతినిధి భర్త ప్రతి నెలా పోలీసులకు, సీఆర్‌డీఏ అధికారులకు లక్షలాది రూపాయలు ఇస్తున్నారని స్థానికుల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాజధానిని కాపాడాల్సిన వ్యక్తులే ఇలాంటి చర్యలకు పాల్పడటంపై భూములు ఇచ్చిన రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. గతంలో ఎవరైనా మట్టి తవ్వుకుంటే రాజధానికి భూములిస్తే గుంతల మయం చేస్తారా ? అంటూ విలేకరుల సమావేశం పెట్టిన మాట్లాడిన వారే ఇలాంటి చర్యలకు పాల్పడడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సీఆర్‌డీఏ అధికారులు, పోలీసులు మట్టి మాఫియాపై దృష్టి సారించకపోతే భవిష్యత్తులో రాజధాని గుంతలమయం అవుతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.



తవ్వకాల సమీపంలో పార్క్ చేసిన పొక్లయిన్

కూటమి నేత అండ



కృష్ణాయపాలెం వద్ద మట్టి మాఫియా పార్కింగ్ చేసిన పొక్లయిన్

మంగళగిరి చుట్టుపక్కల జరుగుతున్న మట్టి మాఫియాకు మున్సిపల్ శాఖ మంత్రి దగ్గరి అనుచరుడు, యర్రబాలేనికి చెందిన మాజీ ప్రజాప్రతినిధి భర్త అండగా నిలుస్తున్నట్లు తెలుస్తోంది. పోలీసులను, సీఆర్‌డీఏ అధికారులను మంత్రి పేరు చెప్పి బెదిరింపులకు పాల్పడి ఈ తవ్వకాలు నిర్వహిస్తున్నాడు. ఒక్క రాత్రిలోనే పలు ప్రాంతాల్లో 10 నుంచి 20 జేసీబీలు, ఐదు పొక్లెయిన్‌లు, 50 నుంచి 100 వరకు టెన్ టైర్లు టిప్పర్లను ఉపయోగిస్తున్నాడు. పగటిపూట ఎవరైనా బిల్డింగ్‌లు కట్టుకుంటుంటే వారికి ఏ రకమైన మట్టి కావాలో అడిగి, రాజధాని ప్రాంతంలో దాన్ని తవ్వి అందజేస్తున్నారు. ఒక లారీకి రూ. 10వేల నుంచి రూ. 15 వేల రూపాయలు వసూలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. సుమారు ఐదు ప్రాంతాల్లో జరిగే ఈ తవ్వకాల్లో ఒక్కొక్క లారీతో 5 నుంచి 10 ట్రిప్పుల వరకు మట్టిని బయటకు తరలిస్తున్నట్లు కొంతమంది లారీ యజమానులు ఆరోపిస్తున్నారు.

పోలీసుల ‘పచ్చ’పాతంపై నిరసన



ఎస్పీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు, ఎన్టీఆర్ జిల్లా పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి, నేతలు

- ఇప్పటి వరకు సీమరాజు, కిరాక్ ఆర్పీలపై కేసులు నమోదు కాలేదు
- మాజీ సీఎం వైఎస్ జగన్, భారతి, వైఎస్సార్ సీపీ నేతలపై అనుచిత వ్యాఖ్యలు
- వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలపై టీడీపీ నేతలు ఫిర్యాదులు చేస్తే వెంటనే కేసులు నమోదు
- గాంధేయ మార్గంలో గుంటూరు జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదుట నిరసన
- గంట సేపు నిలబడి నిరసన వ్యక్తం చేసిన మాజీ మంత్రి అంబటి, మాజీ ఎంపీ మోదుగుల, నేతలు

నగరంపాలెం: వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలపై టీడీపీ నేతలు ఏ చిన్న ఫిర్యాదు చేసినా కేసులు నమోదు, అరెస్టులు చేయడం, జైళ్లకు పంపించడం వెంటనే జరుగుతాయని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు, ఎన్టీఆర్ జిల్లా పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి అన్నారు. టీడీపీ మూకలపై వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు ఫిర్యాదులు చేస్తే కూటమి ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం పట్టనట్లు వ్యవహరిస్తుందని మండిపడ్డారు. గాంధీ మార్గం, ప్రజాస్వామ్య పద్ధతిలో సోమవారం గుంటూరు జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదుట మాజీ మంత్రి అంబటి రాంబాబు, వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి ప్లకార్డులతో నిరసనకు దిగారు. నల్ల దుస్తులు ధరించిన మాజీ మంత్రి అంబటి రాంబాబు ‘నా ఫిర్యాదుపై చర్య తీసుకో ప్రార్థన’ అనే ప్లకార్డు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి ‘సత్య మేవ జయతే’ అనే ప్లకార్డుతో గంటసేపు నిలువు కాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. నేతలు సైతం అదే బాట పట్టారు.

నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న పోలీసులు

మాజీ మంత్రి అంబటి మాట్లాడుతూ పట్టాభిపురం పీఎస్‌లో గతేడాది డిసెంబర్ 12న సీమరాజు అనే వ్యక్తి సోషల్ మీడియాలో ఇష్టం వచ్చినట్లుగా మాజీ సీఎం వైఎస్ జగన్, తనపై, పార్టీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి అనరాని మాటలు అన్నాడని, పచ్చి బూతులు తిడుతున్నాడని ఆధారాల సహా ఫిర్యాదు చేశానని తెలిపారు. కేసులు నమోదులో పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ ఏడాది మే ఐదో తేదీన అదే పట్టాభిపురం పీఎస్‌లో మరోసారి ఫిర్యాదు చేశానని తెలిపారు. గతంలో ఇచ్చిన ఫిర్యాదులపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. మళ్లీ కిరాక్ ఆర్పీ అనే పెద్ద మనిషి పచ్చి బూతులతో సోషల్ మీడియాలో మాజీ సీఎం వైఎస్ జగన్, తనపై, మాజీ మంత్రి ఆర్కే రోజాపై, నాయకులు, కార్యకర్తలను ఇష్టానుసారంగా తిడుతున్నాడని లింక్‌లసహా పెన్‌డ్రైవ్‌లో ఎక్కించి పోలీసులకు అందజేశానని తెలిపారు. పట్టాభిపురం పీఎస్‌లో ఇచ్చిన రెండు ఫిర్యాదులపై కేసులు నమోదు చేయలేదని, ఈ ఏడాది మే పదిన గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌కు మరో ఫిర్యాదు అందించినట్లు చెప్పారు.

పోలీసులు మేలుకోవాలి

వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్, భారతి, వైఎస్సార్ సీపీ నేతలపై అసభ్యకరంగా సోషల్ మీడియాలో, వారికి ఇష్టమైన చానెళ్లలో సీమరాజు అలియాస్ చంద్రకాంత్‌చౌదరి, కిరాక్ ఆర్పీలు తమ వ్యక్తిగత జీవితాల జోలికి వస్తున్నారని మండిపడ్డారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం, పోలీసులు మేలుకోవాలని ఆయన సూచించారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు



అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ, ఇతర అధికారులు

జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ

గుంటూరు వెస్ట్: అర్జీల పరిష్కారంలో అలసత్వానికి తావివ్వొద్దని జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జేసీ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. కొన్ని అర్జీలు వివిధ శాఖలు సమన్వయంతో పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. వీటిపట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కోర్టు కేసులకు సంబంధించి ఆన్సర్లు నిర్ణీత గడువులోనే దాఖలు చేయాలన్నారు. అధికారులు అవసరమైన మేరకు లీగల్ టీమ్ సహాయం తీసుకోవాలన్నారు. అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లక ముందే పరిష్కరించాలన్నారు. ప్రజలు తమ అర్జీలను ప్రజలు స్థానికంగా ఉండే మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయి అధికారులకు ప్రతి వారం ఇవ్వొచ్చన్నారు. దీంతో స్థానికంగా ఉండే ప్రజల సమస్యలు అక్కడే పరిష్కారమవుతాయన్నారు. అనంతరం వచ్చిన 302 అర్జీలను జేసీతోపాటు డీఆర్వో ఖాజావలి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీకుమారి, జిల్లా అధికారులు పరిశీలించారు.

మా ప్రాంతాన్ని అభివృద్ధి చేయండి

తూర్పు నియోజకవర్గ పరిధిలోని 53, 54, 55 డివిజన్లు నగరంలో ఉన్నప్పటికీ గ్రామాలను తలపిస్తున్నాయి. ఎటువంటి అభివృద్ధికి నోచుకోవడంలేదు. ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన వర్గాలు నివసించే ఈ ప్రాంతాల్లో కమ్యూనిటీ హాల్స్, లైబ్రరీలు, క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని మనవి.

– బహుజన సమాజ్ పార్టీ నాయకులు.

ఆర్థిక చేయూతనందించండి

నా కుమారుడికి పూర్తిస్థాయి అంగవైకల్యం ఉంది. నా భర్త నన్ను, నా బిడ్డను వదిలేసి వేరే ఉంటున్నాడు. ప్రస్తుతం బాబుకు 13 సంవత్సరాలు. రూ.6000 వికలాంగుల పెన్షన్ వస్తుంది. పూర్తి అంగవైకల్యం ఉంది. దయ చేసి రూ.15000 ఇప్పిస్తే కొంత వరకు మెడికల్ బిల్స్ కట్టుకుంటాను. నాకు వేరే ఆధారం లేదు. ఆదుకోండి.

– కె.వరలక్ష్మి, ములుకుదురు గ్రామం, పొన్నూరు.

టీడీపీ కార్యకర్తల రాక్షసానందం



టీడీపీ ప్రోద్బలంతో ఆందోళన చేస్తున్న దళిత సంఘాలు

గుంటూరు వెస్ట్: దళితుల సమస్యలు వినేందుకు సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకర్ సమావేశ మందిరానికి వచ్చిన జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామ్ చందర్‌ను తప్పుదోవ పట్టించేందుకు పొన్నూరు నియోజకవర్గం ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అనుచరులు నానా హంగామా సృష్టించారు. హత్యాయత్నానికి గురై ప్రాణాలతో పోరాడుతున్న మన్నవ గ్రామ సర్పంచ్ బొనిగల నాగ మల్లేశ్వరరావును, వైఎస్సార్ సీపీ నాయకులను నానా దుర్భాషలాడారు. ఒక సందర్భంలో అరడజను మంది డీఎస్పీలు, సిబ్బంది వచ్చినా వారిని ఆపలేకపోయారు. ఒక పక్క మీటింగ్ జరుగుతుండగానే తమను లోపలికి పంపాలని, లేకపోతే ఇక్కడే కూర్చుని ధర్నా చేస్తామని రోడ్డుపైనే బైఠాయించారు. పోలీసులు సర్దిచెప్పే ప్రయత్నం చేసినా లాభం లేకపోయింది. పోలీసులు వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని తప్పుడు ప్రచారాన్ని లేవనెత్తారు. దీంతో పోలీసులు చేసేది లేక 10 మందిని లోపలికి తీసుకెళ్లి వినతిపత్రం ఇప్పించారు.

నెంబర్ ప్లేట్‌పై జై తెలుగు దేశం

పెద్దఎత్తున వచ్చిన టీడీపీ కార్యకర్తలు కార్లకు నంబర్లు కూడా తీసేశారు. మంగళగిరి ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి నంబర్‌కు బదులు జై తెలుగుదేశం అని రాసుకున్నారు. కొందరు దళిత సంఘాల నాయకులు దీన్ని వ్యతిరేకించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినా వారు యథావిధిగా టీడీపీ కార్యకర్తలకు అనుకూలంగా వ్యవహరించారు.

బదిలీల్లో బేరసారాలు

- గాలిలో సచివాలయ మహిళా పోలీసుల బదిలీలు
- 107 మందికి ఇంకా దక్కని పోస్టింగ్‌లు
- ముడుపులు, పలుకుబడి ఉన్న వారికే అర్బన్ పోస్టింగ్‌లు
- సిఫార్సు లేఖలు తెచ్చుకోవాలంటూ అధికారుల ఉచిత సలహాలు
- ఆగమ్యగోచరంగా మహిళా పోలీసుల భవితవ్యం



గుంటూరు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న మహిళా పోలీసులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, గుంటూరు: మహిళలకు ఏదైనా సమస్య వస్తే ముందు పోలీస్ శాఖ రక్షణగా ఉంటుంది. అటువంటిది తన శాఖలోనే పని చేస్తున్న సచివాలయ మహిళా పోలీసులకే అన్యాయం చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీనికి నిదర్శనంగా ఇటీవల జరిగిన బదిలీల ప్రక్రియ నిలుస్తుంది. అయిదేళ్లు పూర్తయిన వారికి సాధారణ బదిలీల్లో భాగంగా సచివాలయ ఉద్యోగులకు కూడా గత నెలలో నిర్వహించారు. అయితే, మహిళా పోలీసులకు మాత్రం గత నెల 27, 29వ తేదీల్లో దరఖాస్తు మీద ఐదు ఆప్షన్లు తీసుకుని పంపించేశారు. దీనికి సంబంధించి ఈ నెల 7వ తేదీ రాత్రి 11 గంటలకు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో 107 మందికి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. ఉత్తర్వులు చూసి కంగుతిన్న మహిళా పోలీసులు గుంటూరు ఎస్పీ, పల్నాడు ఎస్పీ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, గుంటూరు జిల్లా ఇంచార్జి మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసి సమస్యను విన్నవించినప్పటికి ఫలితం శూన్యం.

జాబితాలో 107 మంది పేర్లు గల్లంతు

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1,100 మంది మహిళా పోలీసులు పని చేస్తున్నారు. 2019లో వచ్చిన మార్కులు, ర్యాంక్, టెక్నికల్ విద్యార్హతలను బట్టి అందరికీ ఆమోదయోగ్యంగా సచివాలయంలో పోస్టింగ్ కల్పించారు. ప్రస్తుతం ఐదేళ్లు పూర్తి కావడంతో సాధారణ బదిలీల్లో భాగంగా ఉమ్మడి జిల్లాలో ఎక్కడి నుంచైనా ఎక్కడికైనా బదిలీలు చేపట్టారు పోలీస్ అధికారులు. అయితే, ఇందులో రాజకీయ నాయకుల సిఫార్సు లేఖలకు, ముడుపులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ సచివాలయం కేటాయింపు జరిగిందని పలువురు మహిళా పోలీసులు ఆరోపిస్తున్నారు. 1100 మంది ఆప్షన్స్ ఇచ్చారని.. ఇందులో 120 మంది మహిళా పోలీసులు రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్స్(స్పౌజ్, మెడికల్) కింద దరఖాస్తు చేసుకున్నారని, నోటిఫికేషన్ ఇచ్చిన అధికారులు 107 మందికి పోస్టింగ్ ఎందుకు కల్పించలేదని నిలదీస్తున్నారు. దీనిపై పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయ సిబ్బందిని కలిస్తే బదిలీల లిస్ట్‌లో పేర్లు కనిపించడం లేదని తీరికగా సమాధానం చెప్పడంతో మౌనంగా వెనుతిరిగారు.



పోస్టింగ్ ఇస్తున్నట్లు ఆదేశాలు

పల్నాడు ఎస్పీ సీసీ, కంప్యూటర్ ఆపరేటర్‌దే హవా?

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో సచివాలయాల ఉద్యోగులకు సంబంధించి బదిలీల ప్రక్రియ అంతా కూడా గుంటూరు జిల్లా నుంచే జరుగుతుంది. కానీ మహిళా పోలీసు బదిలీ ప్రక్రియ మాత్రం నిబంధనలకు విరుద్ధంగా పల్నాడు ఎస్పీ కార్యాలయానికి అప్పగించారు. ఇందులో కూడా పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయ సీసీ, కంప్యూటర్ ఆపరేటర్లు హవా కొనసాగిస్తున్నారు. రాజకీయ నాయకులు సిఫార్సు లేఖలు తెచ్చిన వారికి, ముడుపులు సమర్పించుకున్న వారికి ఎక్సెల్ షీట్‌లో సచివాలయాలను బ్లాక్ చేసుకుని పోస్టింగ్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ముడుపులు, రాజకీయ నాయకుల సిఫార్సు లేఖలు ఇవ్వని వారిని దూరంగా సుమారు 150 కిలోమీటర్ల దూరంలో ఉండే సచివాలయాలకు బదిలీ చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పోస్టింగ్ కావాలంటే లక్ష సమర్పించుకోవాల్సిందే?

107 మందికి పోస్టింగ్ రాకపోవడంతో గత నాలుగు రోజులుగా పల్నాడు ఎస్పీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ‘‘మీకు పోస్ట్ రాకపోతే మాకు సంబంధం లేదు..రెండు నెలలైనా జీతాలు రాకపోవచ్చు..మీ పోస్ట్ హోల్డ్‌లో పడింద’’ని చెప్పడంతో కంగుతిన్నారు. ఒక్కొక్కరిని కార్యాలయం లోపలికి పిలిచి, ఫోన్లు తీసుకుని మరీ మహిళా పోలీసులతో పోస్టింగ్‌లపై పల్నాడు ఎస్పీ కార్యాలయ సిబ్బంది బేరసారాలు నడిపారని వారు ఆరోపిస్తున్నారు. ఒకవేళ ఇప్పుడు పోస్టింగ్ ఇవ్వాలంటే రూ.60వేలు సమర్పించుకోవాలని..అదే అర్బన్ లిమిట్స్‌లో అయితే రూ.లక్ష వరకు సమర్పించుకోవాలని చెప్పడంతో ఆందోళన చెందుతున్నారు. అంత డబ్బులు ఉంటే మొదటి లిస్ట్‌లో పోస్టింగ్ తెప్పించుకునే వారమని వారు వాపోయారు. తమకు అన్యాయం చేస్తే కోర్టును ఆశ్రయించేందుకు మహిళా పోలీసులు సన్నద్ధం అవుతున్నారు.

విత్తన దుకాణాలలో తనిఖీలు

రూ.60.17లక్షల మిరప, సోయాబీన్స్ విత్తనాల విక్రయాల నిలుపుదల



ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న అధికారులు

కొరిటెపాడు: గుంటూరు నగరంలో వ్యవసాయ శాఖ, విజిలెన్స్/ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ సంయుక్తంగా విత్తనాలు, ఎరువులు/ పురుగుమందుల తయారీదారులు, టోకు వర్తకులు, రిటైల్ డీలర్ల దుకాణాల్లో రెండు బృందాలుగా ఏర్పడి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో మూడు విత్తన దుకాణాల్లో రూ.60.17లక్షల విలువైన మిరప, సోయాబీన్స్ విత్తనాలకు సంబంధించి రికార్డులు లేనట్లుగా గుర్తించారు. దీంతో వాటి విక్రయాలు నిలుపుదలచేశారు. నాలుగు ఎరువుల దుకాణాల్లో రూ.1.66 లక్షల విలువైన 5.35 టన్నుల ఎరువులు, మూడు పురుగు మందుల దుకాణాల్లో రూ.14.13 లక్షల విలువైన 3,460 లీటర్ల పురుగు మందుల విక్రయాలు కూడా నిలుపుదల చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా ఏడీఏ పి.మురళీకృష్ణ, గన్నవరం ఏడీఏ ఎం.సునీల్, విజిలెన్స్ అధికారులు కె.వెంకటేశ్వర్లు, సీహెచ్.రవిబాబు, ఏఓలు సునీల్ కుమార్, బి.కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.



పసుపు ధరలు
(సోమవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 438

కొమ్ములు : 198 బస్తాలు		
	(ధర రూ॥ల్లో)	
కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,000	10,250	10,200

కాయలు : 240 బస్తాలు		
కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,000	10,250	10,200

మొత్తం అమ్మకాలు : 328.500 క్వింటాళ్లు

–దుగ్గిరాల

వాణిజ్యం



నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 1,200 గరిష్టం : రూ. 2,000

మోడల్ ధర రూ. 1,500

మిర్చి యార్డు సమాచారం
(సోమవారం ధరలు)



వచ్చిన బస్తాలు	56,583
అమ్మకాలు	53,846
నిల్వ	5,945

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)	
334	9,500–13,000
నంబరు–5	10,000–13,300
273	10,000–12,500
341	10,000–13,400

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)	
334	9,500–12,600
నంబరు–5	10,000–13,500
273	9,800–12,400
341	10,000–13,500
4884	10,000–12,600

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)	
తేజ	10,000 – 13,500
బాడిగ–355	10,000 – 12,400
దేవనూరు డీలక్స్	10,000 – 12,400
ఆర్మూర్	9,600 – 10,800
తాలుకాయలు	5,000 – 6,700

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)	
తేజ	10,000–13,400
బాడిగ – 355	10,000–12,500
దేవనూరు డీలక్స్	10,000–12,500
తాలు	5,200 – 7,000

–కొరిటిపాడు (గుంటూరు)

విత్తన చట్టంతో నకిలీలకు కళ్లెం

- ప్రతి ప్రైవేటు విత్తనాల దుకాణంలో లైసెన్స్ ప్రదర్శించాలి
- కొనుగోలుదారునికి రశీదు తప్పనిసరి



రాజాగారితోటలోని విత్తనాల షాపు (ఫైల్)

కొరిటెపాడు(గుంటూరు): ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాలో ప్రైవేటు దుకాణాల్లో విత్తనాల విక్రయాలు జోరందుకున్నాయి. అయితే, రైతు అవసరాన్ని ఆసరాగా చేసుకుని మోసగించే చర్యలకు కళ్లెం వేసేందుకు విత్తన చట్టం ఉంది. దాని గురించి రైతులకు తెలియదు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో అన్యాయం జరిగితే డీలర్లపై కఠినతరమైన చర్యలు చేపట్టే అవకాశం ఉంది. విత్తన చట్టం– 1966, విత్తన నిబంధనలు–1968, విత్తన నియంత్రణ ఉత్తర్వులు –1983 తదితర చట్టాలు రైతులకు అండగా నిలుస్తాయి. విత్తనపరమైన అతిక్రమణలు, ఉల్లంఘనలు వర్తించే విధంగా వీటిని రూపొందించారు. విత్తన విక్రయాల్లో మోసాలకు పాల్పడిన వారిపై నియంత్రణ ఉత్తర్వులు–1983 క్లాజు– 3 అతిక్రమించినందుకు జప్తు చేయవచ్చు. అత్యవసర సరుకుల చట్టం 1955 సెక్షన్–ఏ ప్రకారం జరిమానాకు గురవుతారు.

విత్తన లైసెన్సు ప్రదర్శన తప్పనిసరి

ప్రైవేటు విత్తనాల విక్రయ దుకాణాల్లో తప్పనిసరిగా లైసెన్సును ప్రదర్శించాలి. లేనిపక్షంలో అధికారులు అమ్మకాలను నిలిపివేయవచ్చు. అంతే కాకుండా నోటీసు ఇస్తూ దానికి సరైన సమాధానం ఇవ్వకపోతే విత్తన నియంత్రణ ఉత్తర్వులు–1983 క్లాజు–5 ప్రకారం డీలర్ లైసెన్సు సస్పెండ్ లేదా రద్దు చేయవచ్చు.

ధరలు, స్టాకు బోర్డు ఏర్పాటు తప్పనిసరి

విత్తనాలు విక్రయించే దుకాణాల్లో కచ్చితంగా ధరలు, స్టాకు బోర్డులను ఏర్పాటు చేయాలి. లేని పక్షంలో విత్తన నియంత్రణ ఉత్తర్వులు–1083 క్లాజు 8 ప్రకారం ఆయా దుకాణాల్లో అమ్మకాలు నిలుపుదల చేయవచ్చు. అధికారులు వచ్చి ఇచ్చిన నోటీసులకు సరైన సమాధానం ఇవ్వకపోతే లైసెన్సు సస్పెండ్, రద్దు చేయవచ్చు.

అమ్మకాల రశీదు ఇవ్వాల్సిందే !

విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు ఆయా దుకాణదారుడు కచ్చితంగా రశీదు ఇవ్వాలి. ఇవ్వని పక్షంలో విత్తన నియంత్రణ ఉత్తర్వులు–1983 క్లాజు 9 ప్రకారం ముందుగా నోటీసు జారీ చేయవచ్చు. దానికి సరైన సమాధానం ఇవ్వకపోతే డీలర్ లైసెన్సు రద్దు చేయవచ్చు.

విత్తనాల బస్తాలపై లేబుల్ లేకపోతే చర్యలు

డీలర్ దగ్గర కొనుగోలు చేసిన విత్తనాల బస్తాలకు లేబుల్ లేకపోతే విత్తన చట్టం–1966 సెక్షన్ 7 ప్రకారం చర్యలు చేపట్టవచ్చు. అంతే కాకుండా ఆయా విత్తనాలను జప్తు చేసే అధికారం ఉంది. అత్యవసర సరుకుల చట్టం–1955 సెక్షన్ 7 ప్రకారం జరిమానా విధిస్తారు. కాలం చెల్లిన విత్తనాలు విక్రయిస్తే విత్తన చట్టం–1966 సెక్షన్ 7 ప్రకారం, విత్తన నియంత్రణ ఉత్తర్వులు –1983 క్లాజు 8ను అనుసరిస్తూ డీలర్ లైసెన్సు సస్పెండ్, రద్దు చేయవచ్చు.

జిల్లాలో ఇలా..

గుంటూరు జిల్లాలో 600 ప్రైవేటు డీలర్ల దుకాణాలు ఉన్నాయి. ఇందులో 400 మంది విత్తనాల డీలర్లు, 100 మంది ఎరువుల డీలర్లు, మరో 100 మంది పురుగు మందుల డీలర్లు ఉన్నారు.

నిబంధనలు పాటించాలి



విత్తన చట్టానికి అనుగుణంగా డీలర్లు విక్రయించాలి. నిబంధనలు అతిక్రమిస్తే భారీగా జరిమానాలతో పాటు దుకాణాల లైసెన్సును రద్దు చేసే పరిస్థితి ఉంటుంది.

– అయితా నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, గుంటూరు

సీఆర్‌డీఏ గ్రామాల్లో ప్రజలకు జీవనోపాధి కల్పించాలి

కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని

పట్నంబజారు: గుంటూరు పార్లమెంట్ పరిధిలోని అమరావతి, తాడికొండ మండలాల సహా సీఆర్‌డీఏ గ్రామాల్లోని చిన్న, సన్న కారు రైతులకు, భూమి లేని వ్యవసాయ కూలీలకు జీవనోపాధి కల్పించే దిశగా మైక్రో ఎంటర్‌ప్రైజెస్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ప్రోత్సహించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను కోరారు. గత నెలలో కేంద్ర సహాయ మంత్రి కార్యాలయానికి వచ్చిన ప్రతిపాదనలపై స్పందించిన రాష్ట్ర మంత్రి శ్రీనివాస్ సెర్ప్ అధికారులతో కలిసి కేంద్ర మంత్రి పెమ్మసానితో ఢిల్లీలో సోమవారం సమావేశమయ్యారు. దాదాపు 22 గ్రామాలకు సంబంధించి 29వేల మంది రైతులు, 33వేల ఎకరాల భూమిని రాజధానికి అందజేసినట్లు మంత్రి శ్రీనివాస్ తెలిపారు. భూమిలేని వ్యవసాయ కూలీలు జీవనోపాధిపై తీవ్రంగా ప్రభావితం పడిందని, ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కోవాల్సిన పరిస్థితుల్లో అనేక మంది డీఏవై, ఎన్‌ఆర్‌ఎల్‌ఎం పరిధిలోని స్వయం సహాయక బృందాలుగా ఉన్నారని వెల్లడించారు. చిన్న పరిశ్రమలను ఈ గ్రామాల్లో మహిళల ద్వారా మైక్రో ఎంటర్‌ప్రైజెస్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రోత్సహించడానికి అవకాశం ఉందని మంత్రి శ్రీనివాస్ తెలిపారు. దీనికి అవసరమైన వ్యవస్థాపకత నైపుణ్యాభివృద్ధి శిక్షణతోపాటు, సరైన ఫార్డ్, బ్యాక్‌వర్డ్ లింకేజీలను కల్పించాలని తెలిపారు. మంగళగిరి, తుళ్లూరు, తాడికొండ, అమరావతి మండలాల్లోని డీఏవైఎంఆర్‌ఎల్‌ఎం పరిధిలో పనిచేస్తున్న స్వయం సహాయక బృందాలు (ఎస్‌హెచ్‌జీ) లకు సేవలను విస్తరించాలని తెలిపారు. సీఆర్‌డీఏ గ్రామాల్లో మైక్రో ఎంటర్‌ప్రైజెస్ ప్రోత్సాహానికి ఎన్‌ఆర్‌ఎల్‌ఎం కింద ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. ఏపీ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) తరఫున కేంద్ర మంత్రి పెమ్మసానికి పలు ప్రతిపాదనలను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అందజేశారు. గుంటూరు మిర్చి పచ్చళ్ల ఉత్పత్తుల కోసం, లైవ్లీ హుడ్ టెక్ సెంటర్ (మోతడక) ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. లఖ్‌పతీ, దీదీ ఇండస్ట్రియల్ పార్క్ (జక్కంపూడి) విజయవాడ పారిశ్రామిక పార్కును ఏర్పాటు చేసి ప్రధాన లక్ష్యం ప్రతి సంవత్సరం 500 మైక్రో ఎంటర్‌ప్రైజెస్ స్థిరమైన మార్కెట్‌కుగా సిద్ధంగా ఉన్న చిన్న, మధ్య తరగతి పరిశ్రమలపై దృష్టి సారించాలని తెలిపారు. ఈ పర్యటనలో సెర్ప్ సీఈఓ వాకాటి కరుణ, అదనపు సీఈఓ శ్రీరాములు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కట్టుబాట్ల పేరుతో కుల పెద్దల ఆంక్షలు



బాధితుడి మొర అలకిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

- ఓ కుటుంబ సభ్యుల ఆవేదన
- న్యాయం చేయాలని వినతి

నగరంపాలెం: కట్టుబాట్ల పేర్లతో కుల పెద్దలు ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ ఓ కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదులు – పరిష్కారాల వ్యవస్థ (పీజీఆర్‌ఎస్)లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదులను జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ పరిశీలించారు. బాధితుల మొరను అలకించారు. సంబంధిత ఫిర్యాదులకు సంబంధించి పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. బాధితులకు సత్వర న్యాయం అందించాలని ఆయన ఆదేశించారు. జిల్లా ఏఎస్పీలు రమణమూర్తి (పరిపాలన), కె.సుప్రజ (క్రైం), హనుమంతు (ఏఆర్), మహిళా పీఎస్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి కూడా ఫిర్యాదులు స్వీకరించారు.

దాడికి యత్నం



గత నలభై ఏళ్లుగా కాకానితోట వద్ద ఉంటున్నాం. చిక్కు వెంట్రుకల వ్యాపారం చేస్తుంటాం. స్థానికంగా ఉండే నాలుగు కుటుంబాల సభ్యులు పెద్దలుగా చలామణి చేస్తున్నారు. ఏ చిన్న వివాదం జరిగినా వారి సమక్షంలో రాజీ చేసుకోవాలి. పోలీసుల వద్ద కెళ్తే జరిమానాలు విధించడం, కుల బహిష్కరణకు పాల్పడుతున్నారు. ఐదేళ్ల కిందట మమ్ములను ఆరు నెలలు కులం నుంచి బహిష్కరించారు. మళ్లీ వచ్చేందుకు రూ.3 లక్షల జరిమానా చెల్లించాం. ప్రస్తుత రోజుల్లోనూ మూఢ నమ్మకాలు ఏంటని ప్రశ్నించినందుకు నా కుమారులతో అమర్యాదగా మాట్లాడారు. ఈనెల 13 రాత్రి కుటుంబంపై దాడికి యత్నించారు. కులం నుంచి బహిష్కరిస్తున్నామని, లక్ష రూపాయాలు జరిమానా చెల్లించాలని బెదిరించారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేద్దామని వెళ్తే అక్కడా కూడా బెదిరింపులకు పాల్పడ్డారు. వారి ముందు చెప్పు లేసుకుని తిరిగినా సహించరు. తమకు న్యాయం చేయగలరు.

– శ్రీపాటి ఆదెమ్మ, కుమారులు నాగరాజు, రమేష్, వెనిగండ్ల, పెదకాకాని

సోదరుడి కుమారుడి మోసం

పదేళ్ల కిందట భార్య క్యాన్సర్‌తో చనిపోయింది. ఇద్దరు కుమారుల్లో ఒకరికి పెళ్లైంది. ఐదేళ్ల కిందట సోదరుడి కొడుకు నా ఇంటి పత్రాలు తీసుకెళ్లి పత్రాలు తనఖా పెట్టాడు. ఈ క్రమంలో పత్రాలను పెట్టుకున్న వ్యక్తి ఇంటి వద్ద గలాటా సృష్టిస్తున్నాడు. దీనిపై సోదరుడి కొడుకుని అడిగితే సరైన సమాధానం ఉండటంలేదు. గతంలో జరిగిన లారీ ప్రమాదంలో ఎడమ కాలు సగం వరకు విరిగింది. కుడి కాలితో నడవలేని స్థితిలో ఉన్నా. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. దీంతో చేసేది లేక మూడు చక్రాల బండితో మంగళగిరి నుంచి గుంటూరు జిల్లా ఎస్పీ కార్యాలయానికి వచ్చాను. న్యాయం చేయాలి.

– బుల్లా బోడియ్య, బాప్టిస్ట్‌పేట, మంగళగిరి.

క్రెడిట్ కార్డుతో దోపిడీ

గతంలో ఓ మాల్‌లో పని చేస్తుండగా నగరంపాలెంకి చెందిన వ్యక్తి పరిచయమయ్యారు. అతని పేరుతో క్రెడిట్ కార్డు తీసుకుని, నా మొబైల్ నంబర్ ఇచ్చాడని తెలిసింది. దీంతో విడతల వారీగా సుమారు రూ.15 లక్షలు వరకు నిత్యావసర వస్తువులు కొనుగోలు చేశాడు. అయితే ఆ సొమ్మును వాడుకోకపోయినా నాపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అంతేగాక నిత్యావసర వస్తువులకు సంబంధించి డబ్బులు చెల్లించాంటూ నాపై ఒత్తిడి తీసుకొస్తున్నాడు. న్యాయం చేయగలరు.

–సత్యనారాయణ, ఏటీఅగ్రహారం.

బంగారు గొలుసు చోరీ

కొత్తపేటలోని ఓ వాటర్ వర్క్స్‌లో ఆటోడ్రైవర్‌గా కుమారుడు పనిచేసేవాడు. కొద్ది నెలలు కిందట యజమాని ఇంటికి వచ్చాడు. కోడలుకు చేయించిన 81 గ్రాముల బంగారు గొలుసును యజమాని పరిశీలించాడు. అనంతరం గొలుసును కబోర్డులో దాచాం. ఈలోగా కొడుకు సోమశేఖర్ బాబు శీతల పానీయం తీసుకొచ్చేసరికి యజమాని బంగారు గొలుసుతో ఉడాయించాడు. అయితే, నేరం చేసినట్లు ఒప్పుకున్నాడు. ఇటీవల సంగడిగుంటలోని ఇంటికెళ్తే తమపై కత్తితో దాడికి యత్నించాడు. దీనిపై స్థానిక పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశాం. టీడీపీకి చెందిన ఓ నాయకుని సిఫార్సుతో పోలీసులకు చెప్పించుకుని అతను బయటకు వచ్చాడు. మాకు న్యాయం చేయాలి.

– నాగరాజకుమారి, సంగంజాగర్లమూడి

డాక్టర్ హేమంత్‌కు అరుదైన గౌరవం



గుంటూరు మెడికల్: గుంటూరుకు చెందిన ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ ఉప్పుటూరి హేమంత్‌కు అరుదైన గౌరవం లభించింది. లండన్‌లోని రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్ (ఆర్‌సీఎస్) ఆధ్వర్యంలో ఈనెల 9న జరిగిన ఇంటర్నేషనల్ సర్జికల్ ట్రెనింగ్ ప్రోగ్రామ్‌లో (ఫెలోషిప్ ఆఫ్ రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్) ఫెలోషిప్, ఐఎస్‌టీపీ డిగ్రీని ఒకేసారి అందుకున్నారు. గుంటూరు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన డాక్టర్ ఉప్పుటూరి హేమంత్ చెన్నై రాయవెల్లూరులో క్రిస్టియన్ మెడికల్‌కాలేజ్‌లో న్యూరో సర్జరీ పీజీ పూర్తి చేశారు. బ్రిటిష్ న్యూరో సొసైటీ ఆంకాలజీ 2022లో డాక్టర్ హేమంత్‌ను ప్రోడీజీగా గుర్తించారు. ఫెలోషిప్ అందుకుని గుంటూరు విచ్చేసిన డాక్టర్ ఉప్పుటూరి హేమంత్‌ను సోమవారం గుంటూరు కొత్తపేటలోని అమృత హాస్పిటల్, యాంజివోకేర్ హాస్పిటల్ న్యూరో కేర్ హాస్పిటల్‌వైద్యులు ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ మద్ది వినోద్‌కుమార్, ఇంట్రవెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఉప్పుటూరి హేమంత్, డాక్టర్ మన్నె సింధూర, పలువురు వైద్య సిబ్బంది అభినందించారు. గుంటూరు ప్రాంత ప్రజలకు సేవ చేయడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు డాక్టర్ హేమంత్ వెల్లడించారు. వైద్య రంగంలో తనకు లభించిన అరుదైన గౌరవంతో మరింత రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తానని వెల్లడించారు.

వేతన బకాయిలు వెంటనే చెల్లించాలి

జెడ్పీ కార్యాలయం వద్ద ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు నిరసన



గుంటూరు ఎడ్యుకేషన్: వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సోమవారం జెడ్పీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఉద్యోగి కస్తూరి కృష్ణవేణి మాట్లాడుతూ జెడ్పీ కార్యాలయంతో పాటు చైర్‌పర్సన్ క్యాంపు కార్యాలయంలో స్వీపర్లుగా పనిచేస్తున్న తమకు వేతనాలు చెల్లించడం లేదని ఆరోపించారు. తనతో పాటు తెళ్ల హరీష్, వాసిమళ్ల అరుణ, కొల్లిపర రాహుల్, కె.ఆనంద్, వరికూటి నందినిలకుగత 22 నెలలుగా వేతనాలు ఇవ్వలేదని తెలిపారు. అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని, పేదవారిపై జాలి చూపకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు మంద ప్రేమానందం మాదిగ మాట్లాడుతూ జెడ్పీ సీఈవో, డెప్యూటీ సీఈవో నిర్లక్ష్య వైఖరితోనే వేతనాలు చెల్లింపులకు నోచుకోవడం లేదని ఆరోపించారు. వాచ్‌మేన్‌గా పని చేస్తున్న పిడపర్తి కృష్ణవేణి భర్త అనారోగ్యంతో మరణించగా, కనీసం ఆ కుటుంబాన్ని ఆదుకోకపోగా ఆమెకు 22 నెలల జీతం కూడా ఆపేశారని ఆరోపించారు. నిరుపేద కార్మికులపై అధికారులు నిరంకుశత్వంగా వ్యవహరిస్తున్నారని, తక్షణమే స్పందించి వేతన బకాయిలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

కత్తితో దాడి: ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు



దాడిలో తీవ్ర గాయాలైన తూమాటి పృథ్వీరాజ్

చేబ్రోలు: పొలంలోని బొంగులు తగలబడటానికి కారణంపై జరిగిన వివాదంలో కత్తితో జరిగిన దాడిలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలైన సంఘటన చేబ్రోలు మండలం నారాకోడూరులో సోమవారం జరిగింది. చేబ్రోలు మండలం నారాకోడూరు దళితవాడ ప్రాంతానికి చెందిన తూమాటి సుమన్‌కు వేజండ్ల గ్రామంలో వ్యవసాయ భూమి ఉంది. అక్కడ పొలంలో కూరగాయల తోటకు ఉపయోగించే బొంగులను నిల్వ చేసి ఉంచారు. ఆదివారం రాత్రి సమయంలో వారి పొలంలోని బొంగులు తగలబడుతున్నాయి అని తెలిసి సుమన్ బంధువులను తీసుకొని వేజండ్ల గ్రామంలో గల పొలానికి వెళ్లి పరిశీలించి చూడగా బొంగులు తగలబడుతున్నట్లు గమనించారు. వీరి పొలం సమీపంలోనే ఉన్న ఎద్దు యలమందయ్య పొలంలో కూడా కొన్ని బొంగులు తగలబడుతున్నట్లు గుర్తించారు. ఇంటికి తిరిగి వచ్చి సోమవారం ఉదయం కమ్యూనిటీ హాల్ వద్ద కుర్చొని బొంగులు తగలబడిన విషయంపై మాట్లాడుతున్నారు. గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్ వచ్చి 'పొలంలో బొంగులు తగలబడటానికి కారణం నేను అని ప్రచారం చేస్తున్నారని వారితో వివాదానికి దిగాడు. తన వెంట తెచ్చుకున్న కత్తితో తూమాటి సుమన్‌పై దాడి చేసి పొడవటంతో చేతికి, నడుమ భాగంలో గాయాలయ్యాయి. వరుసకు తమ్ముడు అయిన తూమాటి పృథ్వీరాజ్ అడ్డుకోవటానికి ప్రయత్నించగా అతనిపై కూడా దుర్గాప్రసాద్ దాడి చేసి కత్తితో ఛాతీ, వీపు భాగంలో పొడవటంతో తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన ఇరువురిని స్థానికులు ఆటోలో వడ్లమూడిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్య చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చేబ్రోలు ఎస్ఐ డి. వెంకటకృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.